# పుండు (కథ)

-డా. వెల్దండి శ్రీధర్
9866977741

"నీ పేరు ప్రణవి కదూ!" అన్నాను ఏటీఎమ్ లైన్లో నా ముందు నిల్చున్న అమ్మాయిని పరిశీలనగా చూస్తూ ఇంకేవో ఛాయలను ఆమె ముఖంలో వెతుకుతూ. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరమో, రెండవ సంవత్సరమో అనుకుంటాను. దేహంలో టీనేజ్ వన్నె తొంగిచూస్తోంది.

"నా పేరు ప్రణవి కాదంకుల్ ప్రణతి" అంది ఆ అమ్మాయి నన్ను ఎగాదిగా, కొత్తగా చూస్తూనే.

"పోనీ మీ అక్క పేరు ప్రణవి కదూ!" అని మళ్లీ ప్రశ్నించాను ఇద్దరికీ వున్న పోలికల వల్ల పొరబడ్డానేమోనని లైన్లో కాస్త ముందుకు జరుగుతూ.

"అవును మా అక్క పేరు ప్రణవీనే" అంది. ముఖంలో ఇందాకటి ఆశ్చర్యం, అనుమానం స్థానంలో కాస్త మొలక నవ్వు వచ్చింది.

అమ్మయ్య నా గెస్ కొంతైనా కరెక్టయినందుకు నేను లోలోపలే సంతోషిస్తూ "మీ అమ్మ పేరు నీలవేణి కదూ!" అన్నాను మళ్లీ. నా గొంతులో ఏదో ఆప్యాయత తొంగి చూడడం నాది నాకే తెలిసిపోతోంది.

"అవును. మా అమ్మ మీకు తెలుసా అంకుల్?" అంది ఏటీఎమ్ డోర్ లోపలికి వెళ్తూ. డోర్ మూసుకుంది. నేను బయటే నిలబడ్డాను. మా ఊరెంతో మారిపోయింది. ఒకప్పుడు మా ఊరు నుండి ఏ ఊరు వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సే దిక్కు. ఇప్పుడు ఆటోలు, క్యాబ్‌లు, ఏటీఎమ్‌లు, దాని ముందు బారెడు లైను. ఊరిప్పుడు చాలా మారిపోయింది. ఎవరో ఆలోచనా పరుడన్నట్టు గ్రామాలు ధ్వంసం అయినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నట్లు మా ఊరు కూడా మెల్లమెల్లగా ధ్వంసమైపోతూ అటు టౌనూ కాని, ఇటు గ్రామమూ కానీ విచిత్ర స్థితికి వచ్చి ఆగిపోయింది. ఏటీఎమ్ ముందు ఇంత లైనెందుకో, వీరికి ఇన్ని డబ్బులెక్కడి నుండి వస్తున్నాయో నాకు అర్థం కాలేదు. ఏదో అదృశ్య శక్తి వీళ్లని ముందుకు నడిపిస్తుందేమోననిపించింది. లేదూ చావును తప్పించుకోవడానికి చావు అంచులదాకా పోయే పనేమైనా చేస్తున్నారా..!? ఆ అమ్మాయి పిన్ నెంబర్ టైప్ చేసి డబ్బుల కోసం ఎదురు చూస్తోంది.

నీలవేణి నా క్లాస్‌మేట్. అంటే ఇప్పుడు నా వయసే వుంటుంది. నాలుగు పదులు ఇప్పుడిప్పుడే దాటుతూ. నీలవేణి మా క్లాస్‌లోనే కాదు. మా ఊళ్లోనే మెరుపుతీగ, అందాల నెలవంక. ఆమె ప్రేమలో పడని వాడు లేడు. కానీ ఆమె మాత్రం ఎవరి గురించి పట్టించుకునేది కాదు. మేం కనీసం ఆమె దృష్టిపథంలోనైనా పడాలని తెగ తాపత్రయ పడేవాళ్లం. కానీ ఆమె కనుచూపు మేరలోకి కూడా పోలేక ఆ సమీపంలోనే ఎక్కడో జారి పడిపోయేవాళ్లం.

ఏటీఎమ్ నుండి ఒక్కరోజు ఎన్ని డబ్బులు తీయవచ్చో అన్నీ తీసుకొని ప్రణతి బయటకు వచ్చింది. నేను లోపలికి వెళ్లాను. ఏటీఎమ్ కార్డు ఇన్‌సెర్ట్ చేసి తెర మీది అక్షరాల్లోకి చూస్తున్నాను. కానీ నా మెదడంతా నీలవేణినే నిండిపోయింది. ఆటోమెటిక్ టెల్లర్ మిషన్‌తో పోటీపడుతూ యాంత్రికంగా అన్ని వివరాలు ఎంటర్ చేస్తున్నాను. నీలవేణి మాత్రం నా గుండె గదినుండి బయటకు పోవడం లేదు. నీలవేణి మా ఊరి చివరి వాడమీది అమ్మాయి. చాలా చలాకీగా ఉండేది. ఎప్పుడూ ఆమే క్లాస్ ఫస్ట్. ఆత్మాభిమానం గల అమ్మాయి.

ఎప్పుడూ ఏ సాయమూ అడిగేది కాదు. మా నాన్న, అమ్మా వద్దని ఎంత మొత్తుకున్నా నేను నీలవేణి ఇంటికి ఏదో వంకతో వెళ్లేవాణ్ణి. నేనే కాదు నా ఫ్రెండ్స్ చాలా మంది అలానే చేసేవాళ్లు. ఎంత వద్దన్నా మేమంతా అలా వెళ్లడానికి కారణం ఆమె కళ్లలోని అందమే. ఏటీఎమ్ నుండి డబ్బులు తీసుకొని, అదిచ్చిన బ్యాలెన్స్ స్టేట్‌మెంట్‌ను సరిచూసుకుంటూ బయటకు వచ్చాను. ప్రణతి పక్కకి నిలబడి లెక్క సరిచూసుకుంటోంది.

వేళ్ల మధ్య మారుతూపోతున్న నోట్ల వైపు చూస్తూ "మీ నాన్న ఏం చేస్తాడమ్మా" అన్నాను ఏదో ఒకటి మాట్లాడాలని.

ఆమె ఒక్కసారి నా వైపు చూపు తిప్పి చిరునవ్వు నవ్వుతూనే మళ్లీ లెక్క పెట్టడంలో మునిగిపోయింది.

పదవ తరగతి రిజల్ట్స్ ఇంకా రానే లేదు. నీలవేణికి వాళ్ల నాన్న పెళ్లి చేసేశాడు. నాకే కాదు నా ఫ్రెండ్స్ అందరికీ కూడా అదొక పెద్ద షాక్ ట్రీట్‌మెంట్. పదవతరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసై నేను పై చదువుల కోసం హైదరాబాద్ వెళ్లాను. ఆ తరువాత డిగ్రీ, ఎంసీఏ పూర్తి చేసి ఏదో సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాయినయ్యాను. ఈ మధ్య ఊరికి అప్పుడప్పుడు వచ్చి పోవడమే కానీ క్రమంగా నా జ్ఞాపకాల్లోంచి నీలవేణి కనుమరుగయిపోయింది. నేను డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉండగా అనుకుంటాను ఒకసారి బస్టాండ్‌లో కల్సింది ఇద్దరు పిల్లల్ని అటువైపు ఒకరిని, ఇటువైపు ఒకరిని కూర్చోబెట్టుకొని ఏదో బస్ కోసం ఎదురు చూస్తూ. ఎక్కడలేని ఉత్సాహంతో దగ్గరికి వెళ్లి పలకరించాను. జీవితం మోసం చేసిందో, వాళ్ల ఆయనే మోసం చేశాడో ముఖం మీద ఒక విషాదపు మబ్బు కమ్ముకొని ఉంది. దాంతో నేనడిగిన ప్రశ్నలకి చాలా నిర్లిప్తంగా జవాబులిచ్చింది. పిల్లల పేర్లడిగితే కూడా పొడి పొడిగానే చెప్పింది. ఇంతలో ఆమె ఎక్కాల్సిన బస్సు, నేనెక్కాల్సిన బస్సూ రావడంతో ఎవరి దారిన వాళ్లం విడిపోయాం. అప్పటి నుంచి నీలవేణిని మళ్లీ కల్సింది లేదు. ఇన్నాళ్లు అసలు ఆమె నా ఊహల్లోనే లేదు.

ప్రణతి లెక్క సరిచూసుకొని సంతృప్తి పడి నా వైపు చూసింది. ఇక చెప్పండన్నట్టు.

"మాదీ ఈ ఊరేనమ్మా. మీ అమ్మ, నేను పదవ తరగతి దాకా క్లాస్‌మేట్స్‌మి. నేను హైదరాబాద్‌లో ఉంటాను. నీలో మీ అమ్మ పోలికలు చాలా వున్నాయి. అందుకే తొందరగా పోల్చుకోగలిగాను. పొలం కౌలు వ్యవహారమేదో ఉంటే చూడడానికి వచ్చాను. వీలైతే ఒకసారి కలవొచ్చా మీ అమ్మని?" ప్రశ్నించాను. ప్రణతి ఒప్పుకుంటే బావుండుననే ఆరాటం నా మనసులో గింగిర్లు తిరుగుతోంది. ఆమె ఇంకా ఏదో సందేహిస్తున్నట్టు కనిపించి "మీ అమ్మే లేకపోతే నేనీ రోజు బతికి ఉండేవాడ్ని కాదమ్మా! పదవ తరగతిలో మేమంతా గ్రౌండ్‌లో ఆడుకుంటుంటే నాకు పాము కాటేసింది. అప్పుడు మీ అమ్మే పరుగెత్తికెళ్లి ముందు మా ఇంట్లో చెప్పింది. అంతేకాదు నేను కుదుటపడేదాకా గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గరే ఉంది" అన్నాను మరింత వివరంగా.

మా అమ్మ పదవ తరగతి దాకా చదువుకుందా! అన్న ఆశ్చర్యం ప్రణతి ముఖంలో. "అయ్యో రండంకుల్. మిమ్మల్నెప్పుడూ ఈ ఊళ్లో చూళ్లేదు. అందుకే కాస్త అనుమానంగా చూస్తున్నాను. ఏమనుకోకండి" అంటూ దారి తీసింది. నా హీరో హొండా బండి మీద వెళ్తున్నాం ఇద్దరం. ఒకప్పుడు బస్టాండ్ లాంటి తాత్కాలిక నిర్మాణం ఊరి మధ్యలోనే ఉండేది. ఇప్పుడు ఊరి చివరి దళిత వాడకు సమీపంగా కట్టారు. ఊరు అటు కొంచెం, ఇటు కొంచెం పెరిగి సన్నని విభజన రేఖ దగ్గర ఆగిపోయింది. పోతూవుంటే దారికి ఇరు వైపులా కొత్తగా వెలసిన షాప్‌లు అక్కడ కొన్ని అక్కడ కొన్ని కనబడుతున్నాయి. వాటి వెనక ఎక్కువ శాతం ఖాళీ భూమే కనిపిస్తోంది. అక్కడక్కడ పొలాలు కనిపించినా అవీ ఎండిపోయే కనిపిస్తున్నాయి.

**** **** **** ****

ఇంటికి వెళ్లే సరికి వాకిట్లో పీట వేసుకొని మోకాళ్లదాకా చీర పైకి జరుపుకొని ఏడెనిమిది నెలల శిశువుకు స్నానం చేపిస్తోంది నీలవేణి. ఆమెను చూడగానే గుండె వేగం ఒక్కసారి పెరిగి మళ్లీ మామూలు స్థితికి చేరింది. నీలవేణి ముఖంలో ఏ మార్పూ లేదు. ఆ లావణ్యం ఏ మాత్రం తగ్గలేదనిపించింది. ప్రౌఢత్వం వల్ల వచ్చిన గంభీరత అదో రకమైన కొత్త అందాన్ని తీసుకొచ్చింది. తలమీద అక్కడక్కడ వెండి తీగలు తొంగిచూస్తున్నాయి. ముఖం కాస్త వడలిపోయి వుంది. "నీలవేణి బావున్నావా?" అని అడుగుదామని నోరు తెరిచీ తెరవకముందే "అమ్మా! ఈ అంకుల్ ఏటిఎమ్ దగ్గర కల్సిండు. ఈ ఊరేనట. హైదరాబాద్‌లో సాఫ్టవేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడట. టెన్త్‌దాకా నీ క్లాస్‌మేట్‌నని ఇంటికి వస్తానంటే తీసుకు వచ్చాను" అంది ప్రణతి.

నీలవేణి పిల్లవాడి మీద మరో చెంబు నీళ్లు పోసి తలతిప్పి నన్ను పట్టి పట్టి చూసి "కాశీ కదూ! బాగున్నావా? కాశీ! ఎన్నేండ్లకి కనిపించినవు?" అంది. మోకాళ్లపై వెల్లకిలా పడుకున్న పిల్లవాడ్ని బోర్లాపడుకోబెట్టి ప్రణవి అందించిన నీళ్లు ఇంకో చెంబు పోస్తూ.

"బానే వున్నాను. ఎవరీ పిల్లాడు" అన్నాను. చిన్నగా ఏడుస్తోన్న పిల్లవాడ్ని చూస్తూ.

"నా మనవడు. ఇదిగో మా పెద్దమ్మాయి ప్రణవి కొడుకు" అని ప్రణవి వైపు చూసి "ఎనిమిదో నెల. చాలా అల్లరోడు. ఎత్తుకుంటేగానీ ఊకోడు. లేదంటే ఏడుపే ఏడుపు" అంది ముసిముసి నవ్వు నవ్వుతూ, సంబరపడుతూ. పిల్లవాడి స్నానం పూర్తిచేసి చెవుల్లో, కళ్లలో ఉన్న నీళ్లు పోయేలా ఊదింది. కొడుకు గురించి చెప్పే సరికి ప్రణవి కళ్లతోనే నవ్వుతోంది.

"మనవడా?" అన్నాను ఆశ్చర్యపోతూ ప్రణవి వంక ఓ సారి చూసి. 'అంటే అమ్మమ్మ అయిందన్న మాట. అంటే నాకు కూడా తాత వయసు వచ్చిందా?' నా వయసొక్కసారి కంపించిపోయింది. నన్ను నేనే కిందికి మీదికి ఒక్కసారి చూసుకున్నాను.

ప్రణతి ఇంటి ముందున్న నవారు మంచం వేసి కూర్చొమ్మని చెప్పి ఇంట్లోకి వెళ్లింది.

"మంచంలో కూర్చుంటూ మీ ఆయన లేడా?" అడిగాను ఇంటిని పరిశీలిస్తూ. ఈ లోపు ప్రణతి ఒక చేతిలో నీళ్లు, మరో చేతిలో టీ తీసుకొని వచ్చింది. తీసుకోవాలా వద్దా అని ఒకసారి తటపటాయిస్తూనే తీసుకున్నాను.

"లేదు. ఆయన పోయి మూడు నాలుగేండ్లయింది" అంది. ఆ మాట అంటున్నప్పుడు గొంతులో వణుకు స్పష్టంగా తెలుస్తోంది. పిల్లవాడ్ని నా పక్కన పడుకోబెట్టి లంగోటి కట్టింది. మల మూత్రాలు పోయినా పక్క బట్టలు చెడిపోకుండా.

"అవునా! ఏమైంది. ఎందుకలా జరిగింద"న్నాను కాస్త కంగారును ముఖంలోకి తెచ్చుకుంటూ.

"పెళ్లయినప్పటి నుండి వాళ్ల నాయినతో పాటు వ్యవసాయమే చేసేటోడు. కొన్ని రోజులకు కాలాలు ఎన్కకు పట్టి వాళ్ల నాయిన వ్యవసాయాన్ని మానుకున్నడు. కానీ ఈనే వ్యవసాయమే ముంచింది. వ్యవసాయమే తేలుస్తుదదని మొండిగా అప్పులు తెచ్చి మరీ మంట్లెపోసిండు. కానీ మన్ను, మబ్బు రెండూ మోసం చేసినయి. ఇక లాభం లేదని పాత అప్పులకు తోడు మరిన్ని కొత్త అప్పులు చేసి ఆటో కొన్నాడు. ఆటోకు తెచ్చిన అప్పుకు 'కాబూలీ' వడ్డీ నీకు తెల్సుగా మనిషిని జలగలా పీల్చిపారేసే వడ్డీ అది" అంది. మనవడికి పాలియ్యిమని ప్రణవికి అందిస్తూ.

"తండలే', 'వుండీ' అంటారు అట్లాంటిదేనా?" ప్రశ్నించాను. ఏదో కొత్త పదం విన్నట్టుగా ముఖం పెట్టి.

"అవును. మన అవసరాన్ని బట్టీ వడ్డీ రేటన్నమాట. ఈనె తీసుకున్న లక్ష ఇరువై వెయ్యిలకు పది రూపాయల వడ్డీ. వడ్డీ రోజు రోజు కట్టాలి. అసలు రెండు మూడేండ్లల్ల ఎప్పుడన్నా తీర్చొచ్చు. అసలు బాకీ కిందికి ఏమీ రాయని ప్రామిసరీ నోటు మీద సంతకం చేయించి తీసుకుంటరు. ఖాళీ బాండ్ పేపర్ మీద కూడా సంతకం చేయించి తీసుకుంటరు. అట్లనే ఇల్లు కాగితాలు, భూమి కాగితాలు, ఇట్ల ఏముంటే అది వాళ్ల దగ్గర కుదువ పెట్టుకుంటరు"

"వచ్చిన కాస్తో కూస్తో సంపాదన వడ్డీ కట్టుకుంటూ పోతే మరి అసలు బాకీ ఎప్పుడు తెగిపోతది?" అన్నాను. ప్రణతి ఎక్కడికో పోవడానికి బయలుదేరుతూ నీలవేణికి చెప్పి బయటకు వెళ్లింది. ప్రణవి పిల్లవాడికి పాలు తాగించి మళ్లీ తెచ్చి ఇచ్చింది. పిల్లవాడు పిడికిళ్లు బిగించి అమ్మమ్మను చూస్తూ నవ్వుతున్నాడు.

"అదంతే కాశీ! ఈ దోపిడీని ఎవడు అడ్డుకునేటోడు లేడు. నీకెల్లుతే కట్టుమంటడు. లేకుంటే వడ్డీ కట్టుకుంటూ పోవాల్సిందే. ఎట్లనో కిందా మీదా పడి పొర్లాడి పొర్లాడి ఆ వడ్డీ అయినా కట్టుకుంటూ బతుకునీడ్చుకుంటూ వత్తున్నం. కానీ దేవుడు మా మీద నిప్పులు కుమ్మరించిండు. మూడేండ్ల కింద హైవే మీద లారీ యాక్సిడెంటయి ఈనే అక్కడికక్కడే సచ్చిపోయిండు" నీలవేణి కళ్లలో సన్నని నీటిపొర బిందురూపంగా మారి కిందికి జారిపోయింది. కొంగుతో కండ్లు ఒత్తుకొని మళ్లీ తనే "అప్పటి దాకా పెనం మీదున్న మా బతుకులు ఈనే చావుతో పొయ్యిలో పడ్డట్టు అయింది" అంది. పిల్లవాడు నవ్వుకుంటూ నీలవేణి ముఖం మీద పిడికిలితో కొట్టినట్టు చేసేసరికి మళ్లీ చెంపల మీది నుండి జారిపోతున్న కన్నీటి చుక్కను తుడిచినట్టయింది.

"ఇప్పటికీ అసలు బాకీ అట్లనే వుందా?" అంటూ ఏదో సన్నటి ఏడుపు వినబడడంతో ఇంట్లోకి చూపు సారించాను. ప్రణవి కూడా ఏడుస్తోంది. కాసేపు ఏమి చేయాలో తెలియక ఇబ్బందిగా కదిలాను.

"ఈనె సచ్చిపోయినప్పటి నుండీ మాకే తిండికి ఎల్లక ఒక్క పైసా కూడా కట్టలేదు. పోయినేడాది ఉన్న ఒక్క ఎకరం భూమి అమ్మి మూడు లక్షలు కట్టిన. కానీ అది వడ్డీ కిందికి కూడా పూర్తిగా సరిపోలేదన్నడు. మాకు 'కాబూలీ' ఇచ్చిన రాజశేఖర్. రాజశేఖర్ నీకు కూడా తెలుసు. మనతో పాటు తొమ్మిదిదాకా చదివి మధ్యలోనే చదువాపేసిండు చూడు ఆ రాజశేఖర్. అదే మిద్దె నర్సిమ్మరెడ్డి కొడుకు. అతని వెనక వాళ్ల బావ ఎంపిటీసి చంద్రశేఖర్ రెడ్డి ఉండి ఈ దందానంతా నడిపిస్తున్నడంటరు. ఇంకా అసలు బాకీ అట్లనే ఉన్నది"

"ఇన్ని ఒత్తిడిల నడుమ ప్రణవి పెండ్లి బానే చేసినవు" అన్నాను మాట కొనసాగిస్తూ.

"ఏం చేయమంటవ్ కాశీ! ఊరి కండ్లన్నీ నా బిడ్డల మీదనే. ఒక్కదాన్నన్నా దాటిస్తే కొంత బరువు దిగుతుందని రెండేండ్ల కిందటనే ఇల్లమ్మి దాని పెండ్లి చేసిన. కానీ వీడు పుట్టినప్పుడే చాలా కష్టమైంది. పిండం అడ్డం తిరిగిందన్నరు. రాత్రికి రాత్రే ఆపరేషన్ చేయాలన్నరు. నా దగ్గర చిల్లి గవ్వ లేదు. ఆ రాత్రి పైసల కోసం ఎక్కని గడప లేదు. మొక్కని దేవుడు లేడు. అయినా ఒక్క పైస పుట్టలేదు. చివరికి మళ్లీ 'కాల్‌మనీ' రాజశేఖరే దిక్కయ్యిండు. మిత్తీలకు ఇచ్చేవారి సంగతి నీకు తెలియందేముంది. ఆపతి పడుతుందంటే పదిరూపాయలు, పిండం అడ్డం తిరిగిందంటే ఇరవై రూపాయలు మిత్తి. అయినా తప్పలే. మళ్లీ యాభై వేయిలు తీసుకొని కాన్పు, పురుడు ఎల్లదీసిన. కానీ ఆ డబ్బుల్ని తిరిగి కట్టేటపుడే ప్రాణం మీదికి వస్తుంది" అన్నది చేతితో వున్న మనవడిని చూపిస్తూ. "ఈ పిల్లగాడ్ని యాభై వేలు పోసి కొన్నం. భుజానికెత్తుకుంటే యాభై వేల రూపాయల నోట్ల కట్టను ఎత్తుకున్నట్టే వున్నది" అంది వేళాకోలంగా నవ్వుకుంటూనే.

ఆమె నవ్వు ఆగనే లేదు ఇంటి ముందు కానిస్టేబుల్ బండి స్పీడ్‌గా వచ్చి ఆగింది. సైడ్ స్టాండ్ వేస్తూనే "ఇక్కడ నీలవేణి అంటే ఎవరు?" అని అడిగాడు. నన్ను, నీలవేణిని మార్చి మార్చి అదోరకంగా చూస్తూ.

"నేనే సార్!" అంది నీలవేణి చేతిలోని మనవడిని ప్రణవికి అందిస్తూ.

"మా ఎస్సై సార్ రమ్మన్నడు నడువ్ బండెక్కు" అన్నాడు బండి మీద కూర్చొని కిక్ కొడుతూ.

"ఎందుకు సార్! ఏమైంది? నేనెందుకు రావాలి?" అంది నీలవేణి కాస్త ధైర్యంగానే.

"ఎందుకేంది? రాజశేఖర్‌రెడ్డి దగ్గర పైసల్ తీసుకొని కడుతలెవ్వట గదా? ఊళ్లె చాలా మందిని పిలిపించిండు మా ఎస్సై". అతని ముఖంలో ఏదో నిర్లక్ష్యం కనిపిస్తుంది. నువ్వు రానిదే నేను పోను అనే భావం కూడా తొంగి చూస్తోంది.

"నేను తీసుకు వస్తాను మీరు పదండి" అన్నాను నేను అతడినే చూస్తూ.

"నువ్వెవరు తీసుకు రావడానికి దాని మొగునివా? ఆమె రాందే నేను ఇక్కడి నుండి కదలను" అన్నాడతడు కాస్త కఠినంగా.

"నాకేమి మాట్లాడాలో అర్థం కాక కాసేపు నివ్వెరపోయి. మీ వెనకాలే వస్తాం పదండి" అంటూ నా బండీ తీశాను.

మేమక్కడికి చేరే సరికి అక్కడ చాలా మంది ఆడ, మగ వివిధ వయసుల వాళ్లు గుమికూడి ఉన్నారు. అందరి ముఖాల్లో ఏదో ఆందోళన కనిపిస్తోంది. వాళ్లంతా మా ఊరి వాళ్లేనో లేక చుట్టు పక్క గ్రామాల వాళ్లో నేనైతే గుర్తు పట్టలేకపోయాను. అప్పటి దాకా వాళ్లతో ఏదో మాట్లాడుతోన్న ఎస్సై నీలవేణిని, నన్ను బిత్తరపోతూ చూసి "నీలవేణంటే నువ్వేనా" అన్నాడు కాస్త దీర్ఘం తీస్తూ. గొంతులో ఏదో వెటకారం ధ్వనిస్తోంది.

"అవున్సార్ నేనే" అని అతనికి కాస్త దూరంలో నిలబడింది నీలవేణి.

"ఏంటీ రాజశేఖర్‌రెడ్డి దగ్గర పైసల్ తీసుకొని మూడునాలుగేండ్ల నుంచీ ఇవ్వడం లేదట? తీసుకునేటప్పుడు తెలీదా? పైసల్ నీ మొగునియనికున్నవా? నీ మిండెనియనుకున్నవా?" అన్నాడు కాస్త కోపంగానే నీలవేణిని కిందికి మీదికి చూస్తూ.

"లేద్సార్! మేం తీసుకున్నయి లక్షా ఇరువై వేయిలే. ఇప్పటికే జాగమ్మి మూడు లక్షలు కట్టిన. ఇంకా బాకీ అట్లనే వున్నదంటే ఎట్ల సార్. ఆడి మనిషిని ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలి?"

"ఎక్కడి నుంచైనా తెచ్చి కట్టాలి. ఇల్లమ్ముకుంటవో, ఒళ్లమ్ముకుంటవో మాకు తెల్వది. పైసలు మొత్తం రేపు సాయంత్రం వరకు కట్టి తీరాల్సిందే. మీరు రాసిచ్చిన ప్రామిసరీ నోటు కూడా ఉంది" ఎస్సై మాటలు చాలా మితిమీరి ఉండడంతో నాకు ఒంట్లో రక్తం మసలిపోతోంది.

ఇంతలో ఎవరో ముసలాడ్ని ఈడ్చుకొచ్చినంత పనిచేసి ఎస్సై ముందు నిలబెట్టాడు మరో కానిస్టేబుల్.

"వీడెవడు?" అన్నాడు ఎస్సై కాస్త చిరాకుగా. ఆ ముసలాడి పైకి ఒక ఆకలి మీదున్న సింహంలాంటి చూపు విసిరి.

"జగతయ్య అంటే వీడే సార్. ఆ రాజశేఖర్ దగ్గర డబ్బులు తీసుకొని నాలుగేండ్లయింది. డబ్బులియ్యడు. పొలం రాసియ్యిమంటే పొలం రాసియ్యడు. రాజశేఖర్ ఇచ్చిన పిటిషన్‌లో వీని పేరు కూడా ఉంది సార్" అన్నాడు ఆ కానిస్టేబుల్ సెల్యూట్ చేసి.

ఎస్సై ఆ ముసలాడిని తినేసేలా చూస్తూనే కనీసం ఎప్పుడిస్తావు అని కూడా అడగకుండానే పళ్లు పట పట కొరుకుతూ వాని కడుపులో ఈడ్చి ఒక్కటి తన్నాడు. ఆ ముసలోడు బాధతో మెలికలు తిరుగుతూ అల్లంత

దూరాన పడ్డాడు. మళ్లీ లేవబోతుంటే వీపులో బలంగా ఒక్క గుద్దు గుద్దాడు. ఈ సారి అతడు లేవడానికి కూడా ప్రయత్నించలేదు. ఏదో చెప్పబోతుంటే..

"రేపటిలోగా డబ్బులు కట్టలేదనుకో లాకప్‌లోనే చంపిపడేస్తా కొడుకా!" అంటూ పెద్దగా గాండ్రించాడు. అక్కడున్న వాళ్లంతా నాతో సహా భయకంపితులమయ్యాము. ఆ ముసలాడు జరిగిన కరెంట్ షాక్ లాంటి చర్యకు బెదిరిపోయి అలానే పడి ఉన్నాడు. తాబేలులాగా మెల్లగా ఎటో కదలాలని ప్రయత్నిస్తున్నాడు కానీ పరిస్థితి అనుకూలించక మళ్లీ తాబేలు తల లోపలికి పెట్టుకున్నట్టు మిన్నకుండి పోయాడు.

"ఎస్సై నీలవేణి దిక్కు తిరిగి నీకు వేరే చెప్పాలా? రేపటిలోగా పైసల్ కట్టు లేదంటే నువ్వూ, నీ బిడ్డ నా సెల్‌లోకి రావాల్సిందే. పో! రేపు రాపో!" అంటూ అరిచినంత పనిచేశాడు.

నీలవేణి భయం కడుపులో చొచ్చినదానిలా బెదిరి బెదిరి చూస్తూ పోలీస్ స్టేషన్ భయటకు అడుగులు వేసింది. నేను కూడా ఏమి చేయాలో అర్థంకాక ఆమెను అనుసరించాను.

నా వెనక బండి మీద కూర్చుంది కానీ నీలవేణి ఒక్క మాట మాట్లాడడం లేదు. నేను కూడా ఏమి మాట్లాడాలో తెలియక మౌనంగా ఉండిపోయాను. బండి నీలవేణి ఇంటి ముందుకొచ్చి ఆగిపోయింది.

లోపలికి అడుగుపెడుతూనే నీలవేణి ప్రణితను పట్టుకొని బోరున ఏడ్చింది. మనవడు దూలానికి కట్టిన చీర ఊయలలో అప్పుడే నిద్రలోకి జారుకున్నాడేమో దిగ్గున లేచి వాడు కూడా ఏడుపు అందుకున్నాడు. నాకు ఎటూ పాలుపోలేదు. ఇబ్బందిగా కదిలాను. కాసేపు ఏడ్చిన తరువాత నీలవేణి కుదుటపడింది.

"మా బతుకునిండా చీకటే కాశీ! ఏంజెయ్యిమంటవు? ఈ కష్టాలన్నీ ఎన్నడు కడతేరాలే? ఏ దేవుడూ మాకు వరాలివ్వడు. అప్పులిచ్చినోల్లు ఒక దిక్కు, పోలీసోల్లు ఒక దిక్కు మమ్మల్ని రాచి రంపాన పెడుతరు. కడకు ఏమైపోతమో? ఎట్ల సస్తమో నాకు తెలుస్తలేదు" అంది. నీలవేణి ముఖం వాడిపోయిన పొద్దుతిరుగుడు పువ్వులా అయిపోయింది.

ఇంతలో మా బావమర్ధి నుంచి ఫోనొస్తే బయటకు పరుగెత్తుకెళ్లి అతనికి ఏదో చెప్పి వెంటనే రమ్మన్నాను. పదిహేను నిమిషాల తరువాత మా బావమర్ధి వచ్చాడు. "పోదామా బావా?" అంటూ.

మా బావమర్థికి నీళ్లివ్వడానికి అనుకుంటా నీలవేణి లోపలికి వెళ్లింది. ప్రణిత ఏడుస్తున్న కొడుకుకు రొమ్ము నోట్లోపెట్టి అటువైపు తిరిగింది. నేను మా బావమర్థి తెచ్చిన మూడు లక్షల చెక్కును తీసుకొని దాని మీద సంతకం చేసి అక్కడ ప్రణవిది ఏదో బుక్ కనిపిస్తే దానికింద కనిపించేటట్టు పెట్టి బయటకు నడిచాను.

కానీ ఇంకా పోలీస్ స్టేషన్లో ఉన్న చాలా మంది అమాయక ముఖాలు నా కళ్లముందు కదలాడుతూనే ఉన్నాయి. 'ఇపుడు గ్రామాలైనా, పట్టణాలైనా అన్నీ 'కాబూలీ' వాలాల చేతిలోనో, 'తండాల్'ల చేతిలోనే సాలెగూడులో ఇరుక్కున్న పురుగుల్లా ఇరుక్కుపోతున్నాయి. గోవులాంటి రైతులు, చిరు వ్యాపారులు, ఏ తోడు లేని మహిళలు.. కీటకాల్లా 'కాల్‌మనీ'లో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. వీరందరినీ కాపాడడానికి ఏ దేవుడు దిగి రావాలో! అప్పటిదాకా ఎంత మంది ప్రాణాలు, మానాలు గాల్లో కల్సిపోవాలో..!?' ననుకుంటూ నా బండి స్టాండ్ తీశాను. ఇప్పుడు నాకు నీలవేణి ఒకప్పటి నా ఊహా ప్రేయసిలా కాదు ఈ వ్యవస్థ మలిచిన రక్తమోడుతోన్న మానని పుండులా కనిపిస్తోంది.

రోడ్డును చూస్తూ బండి నడుపుతున్న నేను అనుకోకుండా వెనక్కి తిరిగి చూశాను. నీలవేణి ఇంటి గుమ్మం ముందు నిలబడి నా బండి వైపే చూస్తోంది. నా వీపుకు నీలవేణి చూస్తున్న కృతజ్ఞతా పూర్వక చూపులు తాకుతున్నాయి.